## ఆత్మహత్య చేసుకున్న వాళ్ళంతా ఒక చోటచేరి తమ గురించి ఏం చెప్పుకొన్నారు?

**గంటి రమాదేవి కథ**

# ఆత్మహత్య

ఈ కథ వ్రాయడానికి నాకు భయంగా వుంది.

సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు.

భూమికి ఆకర్షణ శక్తి వుంది.

ఇవన్నీ లోకం ఒప్పుకున్న నిజాలు.

కాదన్నవాడు మతిమాలిన వాడు.

ఆత్మహత్య ఎందుకు చేసుకుంటారు?

అనారోగ్యం?— శారీరకం— మానసికం ఏదైనా కావచ్చు.

దారిద్ర్యం?—చిరుద్యోగంలో, నిరుద్యోగంలో వుండే బాధలతో సహా ఏ దారిద్ర్యమైనా కావచ్చు.

ప్రేమ వైఫల్యం?—ఎడబాటు ఆత్మీయులు దూరం కావడం కావచ్చు.

సూర్యుడు తూర్పున తప్ప ఉదయించడు అన్నది ఎంత తిరుగులేని నిజమో, ఆత్మహత్యలు పై మూడు కారణాల, లేదా వాటి ఉపకారణాల వల్లనే జరుగుతాయి అన్నది అంతే!

చిత్రమైన ఆత్మహత్యలు జరుగుతాయి. నమ్మించగలనా?.... అందుకే భయం...

దక్షిణ దిశగా విమానం దూసుకుపోతూ వుంది— ముప్ఫయ్ మూడువేల అడుగుల ఎత్తులో— గంటకు అయిదువందల మైళ్ళ వేగంతో బయట గాలి వేగం ఇనుమును కరిగించే శక్తితో విమానాన్ని రాసుకుంటూ పోతూ వుంది. అంత ఎత్తున ఉష్ణోగ్రత చాలా తక్కువ. మైనస్ ముప్ఫయ్ ఎనిమిది డిగ్రీలు సెల్షియస్. అరక్షణంలో మంచు ముక్కగా మార్తాడు మనిషి. ఒక పక్క అగ్ని. మరో పక్క మంచు రెండూ విమానంతో ప్రయాణిస్తున్నాయి. అటువం



టి వాతావరణంలో రెండు గొంతులు చాలా మాట్లాడుకుంటున్నాయి.

"విమానంలో మీనాన్న హైద్రాబాద్ వెడుతున్నాడు" మొదటి గొంతు అంది.

"తెలుసు" సమాధాన మిచ్చింది రెండో గొంతు.

"నీ విషయం ఆయనకు తెలుసా?"

"సీరియస్ అని టెలిగ్రామ్ ఇచ్చారు"

''హైద్రాబాద్ వెళ్ళాకే తెలుస్తుంది''

''మరి ఆత్మహత్య ఎందుకు చేసుకున్నావ్?''

''చెప్ప''

మరిన్ని గొంతులు ఆతృతగా అడిగాయి.

''మరి మీ రెందుకు చేసుకున్నారు?'' అందులో ఒక గొంతు చెప్పడం ప్రారంభించింది.

''చిన్నప్పుడు విచ్చలవిడిగా తిరిగాను. అనుభవించిన అమ్మాయిల లెక్క మూడువందలు దాటింది. తాగిన సీసాలు వందలు దాటిపోయాయి. నలభై ఏళ్ళకే తీరని రోగాలు పట్టి పీడించాయి. మందులు పనిచెయ్యలేదు. బాధ భరించలేక''

వణుకుతున్న ముసలి గొంతు. చెప్పడం ఆపింది.

''మరి మీ సంగతి?''

''ఇరవై రెండేళ్ళకే డిగ్రీ పూర్తిచేసాను. డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగాన్వేషణ మొదలు పెట్టాను. అనంతమైన అన్వేషణే మిగిలింది. విసిగిపోయాను. రాను రాను ఇంట్లో గౌరవం లేకుండా పోయింది. తమ్ముడూ, చెల్లెలూ కూడా ఛీదరించుకోడం మొదలుపెట్టారు. బంధువులు నన్నుచూసి హేళనగా నవ్వుకునేవారు. మానాభిమానాలు చంపుకోలేక పోయాను. విలువలేని నా జీవితానికి ఈ భూమి నిలువనీడ ఇవ్వలేదు. అందుకే''

ఆ మాటలు పూర్తయిన తర్వాత మూడో గొంతు చెప్పడం మొదలు పెట్టింది.

"నేనో చిన్న ఉద్యోగస్తుడ్ని. స్కూలు ఫైనలు కాగానే ఓ చిన్న వర్క్‌షాపులో అకౌంట్లు రాసే గుమాస్తాగా చేరాను. ఉద్యోగం ఉంది కదాని పెళ్ళి ప్రయత్నాలు మొదలెట్టారు మావాళ్ళు. నే వద్దన్నాను. ఎందుకన్నారు? నా జీతం నాకే సరిపోదన్నాను. అదే పెరుగుతుంది లేవోయ్ అంటూ నా మెడలు విరిచి పెళ్ళి చేసారు. నాలుగేళ్ళలో ముగ్గురు పుట్టారు. రెండోవాడు ఏదో రోగం వచ్చి వైద్య సదుపాయంలేక చచ్చాడు. మిగిలిన ఇద్దరూ, ఎండి శవంలా అయిన నా భార్య నేనూ ఎలాగో జీవితం ఈడ్చుకుంటూ వస్తూవుంటే పిడుగులా ఓ వార్త తెలిసింది. వర్క్‌షాప్ మూసేస్తున్నారు నష్టాలొస్తున్నాయని. చివరకు ఆ వార్త నిజమైంది. రోడ్డున పడ్డాను. జీతం వున్నప్పుడు గడవడమే గగనంగా వుండేది. నిరుద్యోగిగా కొన్నాళ్ళు ఎలాగో నెట్టుకొచ్చాను. పిల్లలకు, పెళ్ళానికి తిండిపెట్టలేని అసమర్థుడ్ని అని తిట్టుకున్నాను. ఉద్యోగమిచ్చే వాడెవడూ లేడు, అప్పిచ్చే వాడు అసలేలేడు. ఆకలి బాధ భరించలేక, నేనూ నా భార్యా ఓ నిర్ణయానికొచ్చాము మేమంతా కలిసి విషం తీసుకోవాలని. అలాగే తీసుకున్నాం. నాతోపాటు తీసుకున్న వాళ్ళెవరూ నాతో రాలేదు. అలవాటుగా మాకున్న దాంట్లో పెద్దవాటా నాకే ఇచ్చింది నా భార్య. తక్కువవాటా తీసుకున్న వాళ్ళు ముగ్గురూ కిందే మిగిలిపోయారు. విషం ఇవ్వడంలో కూడా పతిభక్తి చూపించింది.... దాంతో...ప్ప...'' ఇంకో గొంతుక

మాట్లాడ్డం మొదలుపెట్టింది.

"నేను స్కూల్లో చదువుకుంటున్నాను. మేము బాగా ఆస్తిపరులమే. మా నాన్నకి స్వంత వ్యాపారాలున్నాయి. స్కూల్లో రాణిని ప్రేమించాను. ఇద్దరూ సరదాగా తిరిగాం. ఒకళ్ళను విడిచి ఒకళ్ళం వుండకూడదనుకుని బాసలు చేసుకున్నాం. మా పెద్దవాళ్ళు నన్ను మందలించారు. 'నీ వయసేమిటి? నీ కిప్పట్నించే ప్రేమా?' అన్నారు. 'ప్రేమకు వయసంటూ వుందా?' అని ఎదిరించాను. రాణితో నేను కలవకుండా కట్టుదిట్టాలు చేసారు. నన్ను గదిలో పెట్టి తాళం వేసారు. రాణిని వాళ్ళింట్లో బంధించారు. ఓ రోజు అర్ధరాత్రి తప్పించుకుని రాణి ఇంటికి వెళ్ళను. రాణి గదిలో ప్రవేశించాను. ఇద్దరం ఒకరి కౌగిలిలో ఒకరం వదిగిపోయాం. అదే స్వర్గసుఖం. అయితే అది కొన్ని క్షణాలే. మళ్ళీ

పెద్దలు పర్వతంలా అడ్డుకుంటారని మా కిద్దరకూ తెలుసు. నాతో తెచ్చుకున్న విషాన్ని ఇద్దరం పంచుకుని తిన్నాం. మళ్ళీ జన్మలోనైనా మా ప్రేమ ఫలించాలని కోరుకుంటూ కన్నుమూశాం.'

"అవును..." అంది ఒక ఆడగొంతు.

"అరెరె... విమానం హైద్రాబాద్‌లో దిగుతోంది" అంది ఆ గుంపులో ఒక గొంతు.

"అవును.... విమానాశ్రయంలో మా అమ్మా, మామయ్యా ఎదురు చూస్తున్నారు. మెడికల్ కాలేజీలో స్టూడెంట్సు అప్పుడే పుకారు మొదలుపెట్టారు. నేనెవరినో ప్రేమించానని, కాలు జారానని ఆ విషయం తెలిస్తే పెద్దవాళ్ళు చంపేస్తారని భయపడి వురి వేసుకున్నాననట. ఇంకో పుకారు: పేథోలజీ ప్రొఫెసరు మార్కులు ఆశ చూపి నన్ను వశపరచుకో చూసాడని అది ఇష్టంలేక— అని ఇంకోటి. కాని అసలు విషయం ఎవరికీ తెలియదు. ఆత్మహత్య అనగానే అది ప్రేమ విఫలం కావడమో, కటిక దరిద్రమో, బాగుపడని జబ్బో అనుకుంటారు..."



## చేనును మేసే కంచె

ఈ మధ్యకాలంలో విషపూరితమైన రసాయన పదార్థాల్ని ఉపయోగించే పరిశ్రమలు బాగా పెరిగిపోయాయి. దాంతో ఆ పరిశ్రమలలో పనిచేసే కార్మికులే కాక, చుట్టుపక్కల నివసించేవారు కూడా అలాటి రసాయన పదార్థాల కాలుష్యపు కోరల్లో చిక్కుకొంటున్నారు.

అలాటి పరిశ్రమల్ని గుర్తించి, అవసరమైన ముందు జాగ్రత్తల్ని రూపొందించే బాధ్యతను లక్నోకు చెందిన ఇండస్ట్రియల్ టాక్సికలాజికల్ రీసెర్చి సెంటర్ తీసికొంది. అయితే దురదృష్టవశాత్తూ ఈ సంస్థ చేసే రేడియోధార్మిక పరిశోధనల్లో అవసరమైన జాగ్రత్తల్ని తీసికోక పోవటంతో అందులో పనిచేసే అనేక మంది కార్మికులు, సాంకేతిక వేత్తలు అనారోగ్యం పాలవుతున్నారని సంస్థ ఉద్యోగులు ప్రభుత్వంతో మొరపెట్టుకొన్నారట—చేనును మేసే కంచె అంటే ఇదేనేమో?

జూపిటర్

"నీ కారణమేమిటో చెప్పు" అంది ఆ గుంపు విమానంతో పాటే క్రిందికి దిగుతూ.

"చెబుతాను... వినండి"

* * *

మా నాన్న పేరు శివరావు. పెద్ద రాజకీయవేత్త. ఇప్పుడు హోంమంత్రి. నాకు ఊహ తెలిసినప్పటి నుండి ఆయన రాజకీయాల్లోనే వున్నారు. ఆయన మాటలకీ చేతలకీ పోలికుండదు. అయితే నేనంటే చాలా ప్రేమ. "మా శకుంతల పెద్ద డాక్టరు కావాలి" అంటూ వుండేవారు.

పేరుపొందిన కాన్వెంటులో చేర్పించారు నన్ను— పెద్ద డొనేషన్ చెల్లించి సబ్జక్టుకు ఒక మేష్టరు చొప్పున ఆరు సబ్జక్టులకు ఆరు ప్రైవేటు మాష్టర్లు. ఎస్.ఎస్.సి వరకు ఎక్కడా ఫెయిలవకుండా వచ్చాను.

ఇంటర్మీడియెట్‌లో సైన్సు తీసుకోమని నాన్న బలవంతపెట్టారు. నాకు ఫిజిక్స్ అన్నా కెమిస్ట్రీ అన్నా ఎలర్జీ. ఆర్ట్సు సబ్జక్ట్సంటే ఇష్టం. టైపు, షార్టుహేండ్ ప్రాక్టీసు చేసి సెక్రటరీ కావాలని నా ఆశ. అయితే శ్రీ శివరావుగారు (!) తన హోంమంత్రి హోదాకు అది తక్కువని అభిప్రాయపడ్డారు. నేను డాక్టరునే కావాలిట. ఎం.డి గాని ఎం.ఎస్‌గాని ఇండియాలో చేసి తర్వాత స్టేట్స్ వెళ్ళి పై చదువులు చదవాలట. అప్పుడే ఆయనకున్న ఆస్థికి, హోదాకి, మంత్రిపదవికి సార్థకతట.

ఇంటర్మీడియెట్ సెకండ్ క్లాసులో పాసయ్యాను అతి కష్టంమీద.

మెడిసిన్‌లో ఎంట్రన్సు పరీక్షకు హేమాహేమీల్లాటి లెక్చరర్లను నాకు ట్యూషన్ చెప్పడానికి నియమించాడు మా నాన్న శివరావు.

రాత్రింబవళ్ళు మారిపోసారు. డబ్బు ఆశ చూపించారో, పలుకుబడే చూపించారో ఎంట్రన్స్ పేపరు సంపాదించారు. ఆ పేపరొక్కదాన్లోనే కోచింగ్ మొదలయింది. చేదు వేపకాయలాంటి ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ అతి కష్టంమీద మింగాను. పరీక్షలు రోజు వచ్చింది. నేను చదివిన పేపరే. ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒక్క ముక్క గుర్తులేవు. కాగే పెనంలోపడ్డ నీటి చుక్కలా ఇగిరిపోయాయి. పరీక్ష రాసి బయటపడ్డాను. ఫలితాలు ఇంకా వారం రోజులుండగా నాకో వార్త తెలిసింది. నా పేరు మెరిట్ లిస్టులో లేదు. ఇంకో పది మెడికల్ కాలేజీలు అర్జంటుగా తెరిస్తేగాని నాకు ఛాన్సురాదు ఆ లిస్టు ప్రకారం. ఎగిరి గంతేసాను.

మా నాన్న శివరావు పట్టుపడితే వదలడు. అంత తేలిగ్గా వదుల్తాడా? ఫలితాలు ఇంకో రెండు వారాలు వాయిదా వేయించాడు. వైస్ ఛాన్సలర్, మెడికల్ కాలేజీ సెలెక్షన్ కమిటీ సభ్యులు మా ఇంట్లో సమావేశమయ్యారు.

ఆ రోజు చక్కటి విందు భోజనం వాళ్ళకు. విదేశీ మద్యం మంచి నీళ్ళలా పోసారు.

నన్ను పిలిచారు. మళ్ళీ నాచేత పరీక్ష రాయించారు— మా ఇంట్లో అంతవరకూ తయారైన లిస్టులన్నీ చింపి పారేసారు. మళ్ళీ కొత్త లిస్టులు ఇదివరకు మెరిట్‌లో వచ్చిన పేర్లు లేనేలేవు. ఎలాగూ లిస్టు

మారుస్తున్నాంకదా అనేమో సెలక్షన్ కమిటీవాళ్ళు తమకిష్టమైన పేర్లు రాసుకున్నారు.

నాపేరు ఫస్ట్ లిస్టులో వచ్చింది. మానాన్న కోరిక తీరింది.

కాలేజీ ఫీజు కట్టి వచ్చిన మా నాన్న నేను ఆరోజే డాక్టరయినట్టు సంబరపడ్డాడు.

ఆరునెలలకు మెడికల్ ఎంట్రన్స్ కుంభకోణం అంటూ పేపర్లో వార్తలొచ్చాయి. మా నాన్న పేరు నా పేరు ప్రముఖంగా పేపర్లలో వచ్చాయి. ఒక విలేకరి నా ఫొటో తీయాలని ప్రయత్నించాడు. అది పడనివ్వలేదు మా నాన్న మనుషులు.

ఏం మాయ చేసాడో ఏమో వారం పదిరోజుల్లో అంతా సద్దు మణిగింది.

మొదటి సంవత్సరం నాకు అయిష్టమైన ఫిజిక్స్, కెమిస్ట్రీలు.

ఆరునెలల పరీక్షలలో ఘోరంగా ఫెయిలయ్యాను.

మళ్ళీ సంవత్సరం పరీక్షల్లో అవే మళ్ళీ ఫెయిలయ్యాను.


హ్యూమన్ ఎనాటమీ రెండవ సంవత్సరం ఫెయిలయినా ఆ క్లాసులకు హాజరవ్వచ్చని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ నన్ను పిలిచి చెప్పాడు. రోజులు గడుస్తున్న కొద్దీ నాకూ, మెడిసన్‌కు దూరం ఎక్కువ అవడం మొదలెట్టింది.

మూడవ సంవత్సరం క్లినికల్స్. మిగిలిన స్టూడెంట్స్ దాని గురించి ఉత్సాహంగా మాట్లాడుకుంటూ వుంటే నాకు భయం వేసేది.

ఫార్మాలిడిహైడ్ వాసనలన్నా డెట్టాల్, స్పిరిట్ వాసనలన్నా నాకు వాంతి వచ్చేది. చచ్చిన మానవ శరీరాన్ని చూసి నేను స్పృహ తప్పి పోయేదాన్ని. రక్తం చూసినా సిరంజి చూసినా నాలో వణుకు ప్రారంభమయేది.

నా గురించి ఎప్పటికప్పుడు వార్తలు మా నాన్నకు చేరేవి.

నాకు మెడిసన్ చదవడం ఇష్టంలేదని ఏడ్చాను మా అమ్మ దగ్గర. శాసనసభా



సమావేశాలు ముగిసిన తర్వాత మా నాన్న మా వూరొచ్చాడు. నేను ఫేలవుతున్నానని నాకు మెడిసన్ చదవడం కష్టంగా ఉందని చెప్పాను.'

ఆయన నర్మగర్భంగా నవ్వి "నీకేం భయం లేదమ్మా! అంతా నే చూసుకుంటాగా" అన్నారు.

ఫిజిక్స్, కెమిస్ట్రీ పేపర్లలో పాసయ్యాను. ఎనాటమీలో పాసయ్యాను. ఎలాగని అడగొద్దు. నిజానికి ఆ పేపర్లు నేను రాయలేదు. అగ్ని పర్వతంలా నా మనసు ఉడుకుతోంది. ఏమిటిది? నాకు ఏమీ రాకుండా డాక్టరవుతానా? నాన్న తన పలుకుబడితో నన్ను మెడికల్ ఆఫీసరుగా ఏ ప్రైమరీ హెల్త్ సెంటరుకో పంపితే? అక్కడ నేను వైద్యం ఎలా చేయాలి? ఆర్డర్లమీద ఏ.ఎన్.ఎమ్‌ల మీద ఆధారపడాలా? గ్రామాల్లో వాళ్ళ జీవితాలతో చెలగాట మాడాలా? నా అంతరంగ మదనం రోజు రోజుకీ ఎక్కువ కాసాగింది. సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ ప్రొఫెసర్ నన్ను చూసినప్పుడల్లా వెటకారంగా అనేవాడు.

"చంపడానికి కొంతమందికి లైసెన్సు దొరుకుతుంది" అని. ఎడతెగని అంతరంగ ఘోష. బడబానలంలా మనస్సును కాలుస్తూ నరాలుతోడేసే మనస్తాపం. ఇక ఈ బాధ తట్టుకోలేననిపించింది. హాస్టలు గదిలో ఫేనుకు చీరకట్టి నా మెడకు తగిలించుకున్నాను.

మొదట్లో కొంత బాధ. తర్వాత అనిర్వచనీయమైన తృప్తి ఆనందం. చెప్పడం ఆపింది.... అందరూ క్రిందికి చూసారు. విమానం ఆగింది. స్టెప్ లేడర్ పెట్టారు. శివరావు ముందు దిగాడు. మెట్లదగ్గరున్న కారులో ఏడుస్తున్న తన వాళ్ళని చూసి తల పంకించాడు శివరావు. ఏమయి వుంటుందో గ్రహించాడు.

తుఫానులో వచ్చే పెను ఉప్పెనలాటి దుఃఖాన్ని దిగమింగుతూ కారెక్కాడు. కారు బయలుదేరింది.

"ఎంతపని చేసావమ్మా శకుంతలా! నువ్వు ఇలా చేస్తావని తెలిస్తే ఇంతవరకు రానిచ్చే వాడిని కాదమ్మా"

కారు సీటుకు తల బాదుకుని ఏడుస్తున్నాడు శివరావు.

"శతకోటి సూర్య కాంతులు నన్ను రమ్మని పిలుస్తున్నాయి. అక్కడెంతో ప్రశాంతంగా వుంటుంది. ఈ చీకట్లో నేనుండలేను. వెళ్ళొస్తాను"

శకుంతల ఆత్మ ఆఖరిసారి పలికింది. కాంతి వేగం కన్నా ఎక్కువ వేగంతో ఆమె ఆత్మ గ్రహాలు, గ్రహ మండలాలు, పాలపుంతలు, నక్షత్రాలు దాటి పైపైకి వెళ్ళిపోయింది.